సాక్షి
హనుమకొండ
బుధవారం । 19 । మార్చి । 2025



సినీఫక్కీలో హరిబాబు కోర్టుకు..
సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్య కేసులో నిందితుడు హరిబాబు, అతడి పరారీకి సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. - 8లో▸



సామాజిక అభ్యున్నతికి దోహదం
భారత రాజ్యాంగం సామాజిక వ్యవస్థ అభ్యున్నతికి దోహదపడుతున్న విలువైన డాక్యుమెంట్ అని ఏపీ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నారాయణ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
37^0 / 22^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

సీపీని కలిసిన ఏసీబీ అధికారులు



వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సన్‌ప్రీత్‌సింగ్‌ను ఏసీబీ అధికారులు మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్లు ఎస్.రాజు, ఎల్.రాజు ఉన్నారు. అనంతరం సీపీకి పూల మొక్కను అందజేశారు.

కలెక్టర్ ప్రావీణ్య రక్తదానం



హన్మకొండ అర్బన్ : హనుమకొండ కలెక్టరేట్ ఐడీఓసీలోని జిల్లా ఖజానా కార్యాలయ ప్రాంగణంలో రెడ్‌క్రాస్ సౌజన్యంతో తలసేమియా బాధితుల కోసం మంగళవారం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో కలెక్టర్ ప్రావీణ్య స్వయంగా రక్తదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా ఖజానా అధికారి ఎ.శ్రీనివాస్‌కుమార్, డీఆర్‌డీఓ మేన శ్రీను, బీసీ సంక్షేమ శాఖ అధికారి రామ్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల బాధ్యులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటినుంచి ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు దరఖాస్తులు

ఎంజీఎం : జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న మిడ్ లెవల్ హెల్త్ కేర్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టుల భర్తీకి నేటి (బుధవారం)నుంచి 26వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 పోస్టులు (జనరల్-5, బీసీ-ఏ-1, బీసీ-బీ-1, ఎస్సీ-1, ఈడబ్ల్యూఎస్-4, దివ్యాంగులు-1 కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 46 సంవత్సరాల వయస్సులోపు ఉండి బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎంలో కమ్యూనిటీ హెల్త్ బ్రిడ్జి కోర్సు చదివిన వారికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. దరఖాస్తులు hanamkonda.telangana.gov.in వెబ్‌సైట్‌నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, దరఖాస్తు పత్రంతో పాటు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, హనుమకొండ పేరున ఎస్సీ, ఎస్టీలు రూ.250, ఇతరులు రూ.500, దివ్యాంగులకు ఫీజు మినహాయింపు ఉందని తెలిపారు. విద్యార్హతలు, కుల, నివాస సర్టిఫికెట్లు జత చేసి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

‘దేవాదుల’ గట్టెక్కించేనా?

- రాత్రి వరకు కాని మోటార్ మరమ్మతు
- చివరి ఆయకట్టు రైతుల్లో ఆందోళన
- హడావుడిగా సాగిన మంత్రుల పర్యటన
- ‘ధర్మసాగర్ రిజర్వాయర్’ కార్యక్రమం రద్దు
- దేవన్నపేట పంపుహౌజ్‌కు హుటాహుటిన అధికారులు



దేవన్నపేట వద్ద అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి తదితరులు

సాక్షిప్రతినిధి, వరంగల్/హసన్‌పర్తి/ధర్మసాగర్: వేసవి ఎండల తీవ్రత.. అడుగంటుతున్న భూగర్భ జలాలు.. దీంతో జనగామ, హనుమకొండ జిల్లాల్లోని నాలుగు నియోజకవర్గాల్లో అక్కడక్కడ పంటలు ఎండుతున్నాయి. చేతికందే దశలో దేవాదుల ప్రాజెక్టు పరిధిలో వరి పంటలు దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాజెక్టు కింద 50 నుంచి 60వేల ఎకరాలకు సాగునీరందించేలా దేవాదుల ప్రాజెక్టు మూడో దశలో భాగంగా దేవన్నపేటలో నిర్మించిన పంప్‌హౌజ్ మోటార్లను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించేందుకు మంగళవారం సాయంత్రం పంపుహౌజ్‌కు చేరుకున్నారు. కానీ, మోటారు మరమ్మతుకు రావడం, ఆస్ట్రియా నుంచి వచ్చిన బృందం చేపట్టిన రిపేర్లు పూర్తి కాకపోవడంతో మంత్రులు రాత్రి ఎన్‌ఐటీ గెస్టుహౌస్‌లో ఉన్నారు. అసెంబ్లీలో బుధవారం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో రాత్రి 11.30 గంటలకు హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.

ఫేజ్-3 పనులపైనే దృష్టి...
చేతికందే పంటలను కాపాడేందుకు మూడో ఫేజ్ పనులపై అధికారులు దృష్టి సారించారు. దేవన్నపేట పంపుహౌజ్‌లో ప్రస్తుతం ఒక్కో మోటారు 800 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేస్తోంది. ప్రస్తుతం ఇక్కడ మూడు మోటార్లు ఏర్పాటు చేయగా.. అందులో ఒక్కటి ఆన్‌చేసి జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో సుమారు 60వేల నుంచి 65వేల ఎకరాల వరకు సాగునీరు అందించడంపై దృష్టి పెట్టారు. మంగళవారం రాత్రి వరకు మోటారు మొరాయించడంతో ఈ యాసంగి పంట చేతికందే వరకు నీటి సరఫరా అవుతుందా? అన్న ఆందోళన ఆ నాలుగు నియోజకవర్గాల్లోని రైతుల్లో వ్యక్తమవుతోంది.

హడావుడిగా సాగిన మంత్రుల పర్యటన..
దేవాదుల చివరి ఆయకట్టుకు సాగునీరందించేందుకు యుద్ధప్రాతిపదికన ఖరారైన మంత్రుల టూర్ హడావిడిగా సాగింది. మొదట మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా హసన్‌పర్తి మండలం దేవన్నపేటకు పంప్‌హౌజ్‌కు చేరుకున్నారు. అక్కడినుంచి ధర్మసాగర్ రిజర్వాయర్‌లో నీరు పంపింగ్ అయ్యేలా మోటార్ ఆన్ చేయాల్సి ఉంది. అనంతరం ధర్మసాగర్ రిజర్వాయర్‌కు చేరుకుని అక్కడ పూజలు చేసి.. మీడియా సమావేశంలో మాట్లాడుతారనేది షెడ్యూల్. కానీ, అనుకున్న ప్రకారం దేవన్నపేటకు మంత్రులు చేరుకున్నప్పటికీ మోటార్ మొరాయించడంతో స్విచాన్ చేయకుండా అక్కడే అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద వేసిన టెంట్లు, కుర్చీల వద్దే ప్రజలు, కార్యకర్తలు ఉండిపోయారు.



దేవాదుల పంప్ హౌస్‌ను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



దేవాదుల పంప్ హౌస్‌లో విద్యుత్ స్టార్టర్లను రిపేర్ చేస్తున్న సిబ్బంది

చివరి నిమిషంలో మీడియా సమావేశం దేవన్నపేటలోనే ఉంటుందనడంతో ధర్మసాగర్ నుంచి దేవన్నపేటకు మీడియాతోపాటు నాయకులు, కార్యకర్తలు, అధికారులు వెళ్లాల్సి వచ్చింది. కాగా దేవన్నపేట పంపుహౌజ్, ధర్మసాగర్ రిజర్వాయర్ తోపాటు పలుచోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల పక్కన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, మామిడాల యశస్విని రెడ్డి తదితరుల ఫొటోలు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

అధికారులపై మంత్రి ఉత్తమ్ ఆగ్రహం
దేవాదుల ప్రాజెక్టు దశలు ఎప్పుడు ప్రారంభమయ్యాయని, ఇతర అంశాలపై మంత్రులు అడిగిన ప్రశ్నలకు నీటిపారుదల శాఖ అధికారుల నుంచి సరైన సమాధానం లేదు. దీంతో వారిపై మంత్రి ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్షకు సమాచారం లేకుండా వట్టి చేతులతో వస్తారా అని మండిపడ్డారు. చిన్న చిన్న సమస్యలతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవారెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, పీసీసీ మాజీ కార్యదర్శి నమిండ్ల శ్రీనివాస్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డితోపాటు దేవాదుల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గిట్టుబాటు కాని టమాట సాగు

- దిగజారిన రేటు
- ఆందోళనలో అన్నదాతలు



గొల్లపల్లిలో టమాట ఏరుతున్న కుటుంబ సభ్యులు

ఎల్కతుర్తి : ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటకు గిట్టుబాటు ధర రాకపోగా సాగుకు ఎదురు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో కూరగాయల సాగుపై రైతులు ఆందోళన చెందుతున్నారు. భీమదేవరపల్లి మండలంలోని పలు గ్రామాలు పూర్తిగా మెట్టప్రాంతంలో ఉన్నాయి. కేవలం దేవాదుల కాల్వ, వర్షపు నీరు మాత్రమే ఆయా భూములకు ఆధారం. కాగా ఈ ఏడాది కురిసిన వర్షాలకు చెరువుల్లో, కుంటల్లో నీరు చేరినప్పటికి అవి ఇప్పుడు అడుగంటుతున్నాయి. వ్యవసాయ బావి నీటి ద్వారా పలు గ్రామాల్లోని రైతులు కూరగాయ పంటలు టమాట, బెండ, బీర, వంకాయ ఇతర పంటలు సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో టమాట ధర రూ.5నుంచి రూ.10కి పడిపోయింది. దీంతో రైతులు కూలీకు ఇచ్చే డబ్బులు కూడా రావడం లేదని ఆవేదన చెందుతున్నారు. మార్కెట్‌కు తరలించే ఖర్చు, పంట సాగుకు చేసిన ఖర్చులు ఎదురుపెట్టాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. పంట చేనులోనే వదిలేసి పోవాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మండలంలో కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేసినట్‌లైతే పండించిన పంటలను నిల్వ చేసుకోవచ్చు. గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకునే వీలు ఉంటుందని పలువురు రైతులు మొరపెట్టుకుంటున్నారు.

సాగు విస్తీర్ణం..
భీమదేవరపల్లి మండలంలో మొత్తం 25 గ్రామ పంచాయతీలకు గాను 17,847ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. ఇందులో ప్రధాన పంటలైన వరి 11,894 ఎకరాల్లో సాగు చేయగా మొక్కజొన్న 4,365, మామిడి 1,100, ఆయిల్‌పామ్ 256, పొగాకు 53, మల్బరి 19, కూరగాయలు 17 ఎకరాల్లో సాగు చేశారు. స్వీట్ ఆరేంజ్ 80 ఎకరాలు, సన్‌ఫ్లవర్ 25 ఎకరాలు, సపోటా 11 ఎకరాలు, వ్యవసాయ అధికారులు వెల్లడించారు.

నాణ్యతతో పనులు పూర్తిచేయాలి

- కలెక్టర్ ప్రావీణ్య



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

దామెర : గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. మండలంలోని సీతారాంపురంలో మంగళవారం కలెక్టర్ పర్యటించారు. నాటుకోళ్ల షెడ్, డ్రాగన్ ఫ్రూట్ సాగు తదితర పనులను పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఇంటికి తాగునీరు అందేలా, పైపులైన్ లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీ సంఖ్యను పెంచాలని, పనులపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కుట్టు శిక్షణ కేంద్రంలో అధునాతన యంత్రాలతో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మేన శ్రీను, అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాసారావు, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీధర్, స్పెషల్ ఆఫీసర్ బాలరాజు, తహసీల్దార్ జ్యోతివరలక్ష్మి దేవి, ఎంపీడీఓ కల్పన, ఎంపీఓ రంగాచారి, ఏపీఎం ఝాన్సీ, ఏపీఓ శారద, పీఆర్ ఏఈ సమ్మిరెడ్డి, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ పరిధిలోకి మెప్మా!

హన్మకొండ అర్బన్ : మహిళా సంఘాలను ఒకే గూటికి తీసుకు వచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. పట్టణ ప్రాంతాల్లో పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకు రుణాలు ఇప్పించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందజేస్తున్న మెప్మాను ఇకపై డీఆర్‌డీఏలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో విలీనం కానున్నట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడగానే మెప్మా పరిధిలోని మహిళా సంఘాలు, పరకాల మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సంఘాలు, ఉద్యోగులు, ఆర్పీలంతా సెర్ప్ పరిధిలోకి వెళ్లనున్నారు. ఇప్పటి వరకు కమిషనర్ల ఆధ్వర్యంలో విధులు నిర్వహించిన మెప్మా ఉద్యోగులు, ఆర్పీలు ఇక నుంచి సెర్ప్ ఆధ్వర్యంలో విధులు నిర్వహించనున్నారు.

మహిళా సంఘాలకు ఉగాది కానుక

- రూ.18.33 కోట్లు వీఎల్‌ఆర్ విడుదల



హన్మకొండ అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల నిధులు విడుదల చేసి ఉగాది కానుకగా అందజేసింది. మొత్తంగా రూ.18.33కోట్లు సంఘాల ఖాతాలో జమ కానున్నాయి. హనుమకొండ జిల్లాలో సుమారు 12వేల ఎస్‌హెచ్‌జీలు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం వీఎల్‌ఆర్ 386 వీఓల పరిధిలోని 8,446 ఎస్‌హెచ్‌జీలకు మాత్రమే నిధులు వస్తున్నాయి. ఆర్థిక క్రమశిక్షణ లేక రుణాల చెల్లింపుల్లో వెనకబడిన కారణంగా సుమారు 1,500 సంఘాలు వీఎల్‌ఆర్ కోల్పోయాయి. సంఘాలు ఎంత రుణం తీసుకున్నా వీఎల్‌ఆర్ మాత్రం రూ.5లక్షల రుణం ఇస్తారు.

మండలాల వారీగా వీఎల్‌ఆర్ అర్హత పొందిన సంఘాల వివరాలు

మండలం	వీఓలు	ఎస్‌హెచ్‌జీలు	వీఎల్‌ఆర్ (రూ.లక్షల్లో)
ఆత్మకూరు	29	573	113.26
భీమదేవరపల్లి	43	955	228.07
దామెర	22	494	118.71
ధర్మసాగర్	40	877	183.71
ఎల్కతుర్తి	39	821	188.85
హసన్‌పర్తి	24	517	114.03
ఐనవోలు	35	799	160.29
కమలాపూర్	51	1,325	304.73
నడికుడ	28	485	90.49
పరకాల	14	289	62.84
శాయంపేట	42	842	159.60
వేలేరు	19	469	108.94
మొత్తం	386	8,446	1,833.53

మొండికేస్తే ఆస్తుల జప్తు..

గ్రేటర్ పరిధిలో వారంలో 356 ఆస్తులు సీజ్
- రూ.44లక్షలు చెల్లించని జయ నర్సింగ్ కాలేజీకి తాళం
- పన్ను బకాయిదారులపై అధికారుల కొరడా



జయ నర్సింగ్ కాలేజీని సీజ్ చేస్తున్న అధికారులు

వరంగల్ అర్బన్ : బల్దియా పన్నుల విభాగం అధికారులు, సిబ్బంది ఆస్తిపన్ను వసూళ్లపై దూకుడు పెంచారు. పన్ను చెల్లించని బకాయిదారులకు డిమాండ్, రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. అయినా స్పందించకపోవడంతో ఆస్తులను సీజ్ చేసి జప్తు చేస్తున్నారు. మూడేళ్లుగా రూ.44 లక్షల ఆస్తి పన్ను బకాయి ఉన్న హనుమకొండలోని జయ నర్సింగ్ కళాశాలను మంగళవారం సీజ్ చేశారు. ఇలా వారం రోజుల్లో 356 ఆస్తులను సీజ్ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.118.06కోట్లకు గాను రూ.61.39కోట్లు మాత్రమే వసూలు చేశారు. మరో 13 రోజుల్లో గడువు ముగియనుంది.

మెమోల జారీతో..
బల్దియాకు ఆస్తి పన్ను ప్రధాన వనరు. పన్నుల వసూలులో మొదటినుంచి నిర్లక్ష్యంగా ఉంటూ మార్చిలో హడావుడి చేస్తుండడంతో మేయర్, కమిషనర్ ఇటీవల సమావేశాల్లో ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తాజాగా డిప్యూటీ కమిషనర్లకు, టీఓకు, ఆర్ఓ,ఆర్ఐ, వార్డు ఆఫీసర్లకు మెమోలు జారీ చేశారు. రాష్ట్ర పురపాలక శాఖ ఉన్నతధికారులు వందశాతం పన్నుల వసూలు చేయకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరికలు చేశారు.

అద్దె వ్యాపార సంస్థలకు తాళాలే..
అద్దె భవనంలో వ్యాపారం చేస్తున్నా.. ఆస్తిపన్ను చెల్లించాల్సిన బాధ్యత భవన యజమానిదే. ఇకపై అలా కుదరదని తాముంటున్న భవనానికి సంబంధించి ఆస్తిపన్ను చెల్లింపు బాధ్యతను అద్దెదారులు పట్టించుకోవాలంటున్నారు బల్దియా అధికారులు. లేని పక్షంలో చట్టప్రకారం తీసుకునే చర్యలతో నష్టపోవాల్సి వస్తుందని, తాజాగా సుబేదారిలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌ను సీజ్ చేశారు. దీంతో చేసేదేమి లేక సదరు యజమాని ఆస్తి పన్ను చెల్లించాల్సి వచ్చింది. ప్రతినెలా ఆస్తిపన్నుపై 2శాతం వడ్డీ, అంటే ఏడాదికి 24శాతం అవుతోంది. ఇలా ఏళ్ల తరబడి చెల్లించని పన్ను బకాయిదారులకు ఆస్తి పన్ను భారంగా మారుతోంది. ఆర్థిక సంవత్సరం ముగింపునకు చేరడంతో ఎంత మేరకు లక్ష్యాన్ని సాధిస్తారో చూడాలి.

విద్యుత్ మోటారు ఆన్ చేస్తూ.. మృత్యుఒడికి

- షాక్‌కు గురై రైతు మృతి
- కొండపర్తిలో ఘటన



రమేశ్(ఫైల్)

ఐనవోలు: విద్యుత్ మోటారు ఆన్ చేస్తున్న క్రమంలో షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కొండపర్తిలో చోటు చేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాల్నె రమేశ్ (45) వ్యవసాయంతో పాటు కులవృత్తి (గౌడ) కల్లు తీస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు మాదిరిగానే వరి పంటకు నీరు పారించడానికి మంగళవారం ఉదయం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో స్టార్టర్ ద్వారా వ్యవసాయ మోటారు ఆన్ చేస్తుండగా ఎడమ చేతికి విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై పక్కనే ఉన్న నీటి కాల్వలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టు పక్కల రైతులు గమనించి మృతుడి భార్య, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తన భర్త మృతి విషయంలో ఎవరిపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి భార్య శోభారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

డబ్బులు ఇవ్వడం లేదని వాట్సాప్‌లో వైరల్

- వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సందీప్ రెడ్డి

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పోతు సుమలత భర్త రమణా రెడ్డి తనకు సుమారు రూ.12లక్షలు ఇవ్వాలంటూ అదే గ్రామానికి చెందిన మూలగుండ్ల సందీప్ రెడ్డి వాట్సాప్ గ్రూప్‌ల్లో మెసేజ్ పోస్ట్ చేశాడు. అనంతరం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కాగా, రమణారెడ్డి భార్య సర్పంచ్‌గా ఉన్నప్పటి నుంచి కాంట్రాక్ట్ పనుల కోసం సందీప్ రెడ్డి వద్ద డబ్బులు తీసుకున్నాడని, సర్పంచ్ పదవి అయిపోయినా రమణారెడ్డి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని సందీప్‌రెడ్డి పలు వాట్సాప్ గ్రూప్‌లలో మెసెజ్ పెట్టాడు.

భర్తకు సర్దిచెప్పిన భార్య అనూష
సందీప్ రెడ్డి వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేసిన విషయం తెలుసుకున్న అతని భార్య అనూష తనభర్తకు ఫోన్ చేసి డబ్బులు ఈరోజు కాకపోతే రేపు వస్తాయని, నీవు లేనిపోని ఆలోచనలు పెట్టుకోకుండా ఇంటికి రావాలని సర్దిచెప్పింది. కాసేపటి తర్వాత సందీప్‌రెడ్డి ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో అనూష తమ బంధువులకు సమాచారం ఇచ్చింది. దీంతో వారు పోలీసులకు తెలపడంతో ఎస్సై జక్కుల పరమేష్ హుటాహుటినా సందీప్‌రెడ్డి ఫోన్ నంబర్‌ను ట్రేస్ చేశారు. ఆత్మకూరు మండలం నీరుకుళ్ల మూలతాళ్లవద్ద ఉన్నాడని గుర్తించి, అక్కడికి చేరుకోగా సందీప్‌రెడ్డి పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే 108 వాహనంలో చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

చివరి ఆయకట్టుకు సాగు నీరందించండి

- అసెంబ్లీలో దండం పెట్టి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కమలాపూర్ : నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు పంటలకు సాగు నీరందించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. కమలాపూర్ మండలంలోని శ్రీరాములపల్లి, అంబాల, గూనిపర్తి, మాదన్నపేట, శనిగరం, లక్ష్మిపూర్, గోపాల్‌పూర్, బత్తినివానిపల్లి తదితర గ్రామాలకు సాగు నీరందక వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. డీబీఎం-21, 22, 23, 24 ద్వారా వెంటనే సాగు నీరు అందించాలని అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వానికి దండం పెట్టి విజ్ఞప్తి చేశారు. ఇటీవల స్టేషన్ ఘన్‌పూర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.800 కోట్లు కేటాయించారని, అదే విధంగా హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలన్నారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, నియోజకవర్గంలోని 107 గ్రామాల్లో ఏ ఒక్క గ్రామంలోనైనా వంద శాతం రుణమాఫీ అయితే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు.

పల్లె దవాఖానాలో మెరుగైన వైద్యసేవలు

- డీఎంహెచ్‌ఓ అప్పయ్య



వైద్యసిబ్బందితో డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఆత్మకూరు : పల్లె దవాఖానాలో గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని డీఎంహెచ్‌ఓ అప్పయ్య పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపూర్ పల్లె దవాఖానాను మంగళవారం కేంద్ర బృందం సభ్యులు వర్చువల్‌గా పరిశీలించారు. బిల్డింగ్ నిర్మాణం, హెర్బల్ గార్డెన్, బయో వేస్టేజ్, రోగులకు అందించే సేవలు, గర్భిణులకు అందించే వైద్యం, శిశు ఆరోగ్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమం తదితర అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాల ద్వారా రోగులకు వైద్య పరీక్షలతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి స్పందన, వైద్యులు పద్మశ్రీ, పుష్పలీల, నర్సింగరావు, సీహెచ్‌ఓ జునేటి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పరిహారం ఇస్తారా..!

- నిధులున్నా.. నిర్లక్ష్యం ఎవరిది?

హన్మకొండ అర్బన్ : ఆత్మకూరు మండలం నీరుకుళ్లకు చెందిన రైతు లక్కర్సు మొగిలి అప్పుల బాధతో పురుగుల మందు తాగి 2014లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో పరిహారం కోసం బాధిత కుటుంబం అప్పట్లో మండల, జిల్లాస్థాయి అధికారులను ఆశ్రయించగా, వారి అభ్యర్థనను తిరస్కరించారు. దీంతో బాధిత కుటుంబం లోకాయుక్త, న్యాయస్థానాన్ని ఆశ్రయించగా పదేళ్లకుపైగా కేసు కొనసాగింది. ఎట్టకేలకు బాధిత కుటుంబ అభ్యర్థనతో ఏకీభవించిన న్యాయస్థానం సదరు కుటుంబానికి రూ.5లక్షలు పరిహారం చెల్లించాలని ఆదేశించింది. జిల్లా అధికారులు అప్పట్లో పనులు పూర్తి చేసి పరిహారం చెల్లింపు నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయగా నిధులు కూడా విడుదల చేసింది. కానీ జిల్లాస్థాయిలో వాటి విడుదలకు ఉత్తర్వులు రాకపోవడంతో చెల్లింపు జరగలేదు. దీంతో బాధితులు మరోసారి కోర్టును ఆశ్రయించడంతో ఆగ్రహించిన న్యాయస్థానం సంబంధిత తహసీల్దార్‌కు వేతనం, ఇతర ప్రోత్సాహకాలు నిలిపివేయాలంటూ ఆదేశాలు ఇచ్చింది. ఇదే విషయమై కలెక్టరేట్ అధికారులను సంప్రదించగా తమకు కోర్టు ఉత్తర్వుల కాపీ అందిన వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వినియోగదారులతో సీఎండీ ముఖాముఖి



హన్మకొండ: విద్యుత్ వినియోగదారులతో టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ముఖాముఖి నిర్వహించారు. మంగళవారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి విద్యుత్ వినియోగదారులతో ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడారు. నూతనంగా సర్వీస్‌లు పొందిన గృహ, వ్యవసాయ, వాణిజ్య, పరిశ్రమల వినియోగదారులకు స్వయంగా ఫోన్ చేసి వారితో సంభాషించారు. సర్వీస్ మంజూరు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కొత్త సర్వీస్ మంజూరులో జాప్యం జరిగిందా? కాల పరిమితికి లోబడి మంజూరు చేశారా? విద్యుత్ అధికారులు నిబంధనల మేరకు మంజూరు చేస్తున్నారా? అధికారులు ఎలా పని చేస్తున్నారు? వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు ఇతర సేవలు ఏ విధంగా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరుణ్ రెడ్డి మాట్లాడుతూ మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడానికి వినియోగదారుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు నేరుగా వారితో మాట్లాడానన్నారు. ఫీడ్ బ్యాక్ తీసుకోవడం, అభిప్రాయాలు తెలుసుకోవడం ద్వారా అవసరమైన మార్పులు తీసుకొచ్చే అవకాశముందన్నారు. అదే విధంగా సత్సంబంధాలు పెరుగుతాయన్నారు. వినియోగదారుల్లో కంపెనీపై విశ్వాసం, సేవల పట్ల నమ్మకం కలుగుతుందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడానికి ప్రతీ ఉద్యోగి నిబద్ధతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

సినీఫక్కీలో హరిబాబు కోర్టుకు..

న్యాయస్థానం వెనుక గేటు నుంచి రిమాండ్‌కు తరలింపు

- హరిబాబుతోసహా మరో ఇద్దరు సహాయకుల అరెస్ట్, కోర్టులో హాజరు
- కోర్టుకు వచ్చిన రాజలింగమూర్తి భార్య సరళ, బంధువులు
- నిందితుడిని చూపించాలని డిమాండ్
- అక్కడే ఉన్న బీఆర్ఎస్ నాయకులను నిలదీత .. అరగంటపాటు ఉద్రిక్తత
- హరిబాబు పరారీకి సహకరించిన ఇద్దరికి బెయిల్ మంజూరు?



కోర్టు వద్ద బీఆర్ఎస్ నాయకులను నిలదీస్తున్న రాజలింగమూర్తి భార్య సరళ

భూపాలపల్లి : సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసులో నిందితుడు హరిబాబు, అతడి పరారీకి సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు కోర్టుకు తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించారు. కోర్టుకు రాజలింగమూర్తి భార్య సరళ, బంధువులు రావడం.. అక్కడే కొంతమంది బీఆర్ఎస్ నాయకులు కూడా ఉండడంతో సుమారు అరగంటపాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఉదయం 9 గంటలకే కోర్టుకు..

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన భూపాలపల్లి పట్టణానికి చెందిన రాజలింగమూర్తి గత నెల 19న హత్యకు గురి కాగా, ఈ హత్య కేసులో ఏ–8గా ఉన్న నిందితుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, అతడి పరారీకి సహకరించి, వెంటే ఉన్న ములుగు జిల్లాకు చెందిన వట్టే రమణయ్య, రమను ఏ–11, ఏ–12గా చేర్చిన భూపాలపల్లి పోలీసులు మంగళవారం ఉదయం 9 గంటలకే జిల్లా కేంద్రంలోని ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు తీసుకొచ్చారు. కోర్టులో హాజరుపర్చగా నిందితులకు జడ్జి ఎస్. రాంచందర్‌రావు 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు నిందితులను ఖమ్మం జైలుకు తరలించారు.

కోర్టు వద్ద తీవ్ర ఉద్రిక్తత..

కోర్టు వద్ద ఘర్షణ చోటు చేసుకునే అవకాశం ఉందని భావించిన పోలీసులు సినీ ఫక్కీలో హరిబాబును రిమాండ్‌కు తరలించారు. రమణయ్య, రమను కోర్టు ముందు గేటు ద్వారా తీసుకెళ్లారు. హరిబాబును మాత్రం వెనుక గేటు నుంచి తీసుకెళ్లి పోలీసు వాహనంలో రిమాండ్‌కు తరలించారు. విషయాన్ని గమనించిన సరళ, ఆమె బంధువులు.. హరిబాబును తమకు చూపించాలని పోలీసులను డిమాండ్ చేశారు. అక్కడే ఉన్న బీఆర్ఎస్ నాయకులను సరళ నిలదీసింది.

ఏ–11, ఏ–12కు బెయిల్?

హరిబాబు పరారీకి సహకరించి, అతడి వెంట ఉన్న రమణయ్య, రమకు కోర్టు బెయిల్ మంజూరు చేసినట్లు తెలిసింది. జమానతులు సమర్పిస్తే నేడు బెయిల్ రానున్నట్లు సమాచారం.

ఆరుగురు నిందితుల కస్టడీకి పోలీసుల అప్పీలు..

హత్య కేసులో ఏ–1గా ఉన్న రేణికుంట్ల సంజీవ్, ఏ–2 పింగిలి సేమంత్, ఏ–3 మోరె కుమార్, ఏ–4 కొత్తూరి కిరణ్, ఏ–6 దాసారపు క్రిష్ణ, ఏ–8 కొత్త హరిబాబును విచారణ నిమిత్తం ఏడు రోజుల కస్టడీ కోసం పోలీసులు కోర్టులో నేడు పిటిషన్ దాఖలు చేయనున్నట్లు సమాచారం.

హరిబాబు బెయిల్ పిటిషన్‌పై నేడు హైకోర్టులో విచారణ..

కొత్త హరిబాబు పరారీలో ఉండి ఈ నెల 4వ తేదీన హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. మూడు, నాలుగుసార్లు వాదనలు జరగగా విచారణ మంగళవారం(నిన్న)కు వాయిదా పడగా అదే రోజున హరిబాబును పోలీసులు కోర్టు ముందు హాజరుపరిచారు. దీంతో హరిబాబు తరపున లాయర్ ముందస్తుకు బదులు సాధారణ బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయగా బుధవారం విచారణ జరగనున్నట్లు సమాచారం.



హరిబాబును ఖమ్మం జైలుకు తరలిస్తున్న పోలీసులు (ఎడమ నుంచి రెండో వ్యక్తి)

ముగ్గురి అరెస్ట్..

రాజలింగమూర్తి హత్య కేసులో ప్రధాన నిందితుడు కొత్త హరిబాబుతో పాటు, అతడు పారిపోవడానికి సహకరించిన మరో ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ డి. నరేశ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు జిల్లాకు చెందిన వట్టే రమణయ్య, రమ.. హరిబాబు పారిపోవడానికి సహకరించారని, ముగ్గురిని ఒకే దగ్గర అదుపులోకి తీసుకున్నట్లు ప్రకటించారు.

భారత రాజ్యాంగం.. సామాజిక అభ్యున్నతికి దోహదం



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వజడ్జి జస్టిస్ పీఎస్ నారాయణ



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రయ్య



మాట్లాడుతున్న మహ్మద్ రియాజ్

- ఏపీ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నారాయణ
- కేయూలో జాతీయ సదస్సు ప్రారంభం

కేయూ క్యాంపస్ : భారత రాజ్యాంగం సామాజిక వ్యవస్థ అభ్యున్నతికి దోహదపడుతున్న విలువైన డాక్యుమెంట్ అని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నారాయణ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలోని ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో '75 ఏళ్ల భారత రాజ్యాంగం మైలు రాయి.. సమస్యలు– సవాళ్లు' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం సెనేట్ హాల్‌లో నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతీయ సమాజం విభిన్న సంస్కృతుల జాతుల కలయిక అని, ఇండియాలో నివసించే వ్యక్తులందరూ రాజ్యాంగం పరిధిలో జీవిస్తున్నారన్నారు. సమసమాజ స్థాపనకు భారత రాజ్యాంగ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సెక్యులర్ భావాలతో రాజ్యాంగంలో పేర్కొన్న ప్రతీ ఆర్టికల్ దేశ ప్రజలందరికీ ఉపయోగపడుతుందన్నారు.

మానవ అభివృద్ధికి విద్య దోహదం..

మానవ అభివృద్ధికి విద్య ఎంతో దోదపడుతుందని తెలంగాణ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ చంద్రయ్య అన్నారు. బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల అభివృద్ధికి రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు సమాజ అభ్యున్నతికి దోహదపడుతున్నాయన్నారు. భగవద్గీత, వేదాలు ఉపనిషత్తులు, అన్ని గ్రంథాలతోపాటు రాజ్యాంగాన్ని కూడా ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అధిక నిధులు కేటాయించాలన్నారు. విద్య, వైద్యం ఉచితంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రత్యామ్నాయ రాజకీయాలు రావాలి..

ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో విలువలు లేవని, దీనివల్ల ప్రజలకు ఎలాంటి మేలు జరగడం లేదని, అందుకే ప్రత్యామ్నాయ రాజకీయాలు రావాలని కేయూ మాజీ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దేశంలో నిజాయితీ గల రాజకీయ వ్యవస్థ లేకుండా పోయిందన్నారు.

సెక్యులర్ భావాలు కలిగిన వ్యవస్థ..

ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగ వ్యవస్థను కలిగిన భారతదేశంలో భిన్న సంస్కృతులు, ఆచార వ్యవహారాలు ఉన్నాయని, ముఖ్యంగా సెక్యులర్ భావాలతో కలిగిన వ్యవస్థ ఉందని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ చైర్మన్ మహ్మద్ రియాజ్ అన్నారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో అనేక సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతోందన్నారు. యూనివర్సిటీల్లో కూడా టీచింగ్ ఫ్యాకల్టీని నియమించబోతున్నారని వెల్లడించారు. అనంతరం కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, కేయూ ఎస్సీ,ఎస్టీ సెల్ డైరెక్టర్, సెమినార్ డైరెక్టర్ తుమ్మల రాజమణి, ఓయూ 'లా' కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ ద్వారకానాథ్ మాట్లాడారు. కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం, సైన్స్ కోర్సుల డైరెక్టర్ బి. వెంకటగోపినాథ్, డాక్టర్ మేఘనరావు, డాక్టర్ ప్రగతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

- శరవేగంగా రన్‌వే భూ సేకరణ పనులు
- వరంగల్ ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి
- నక్కలపల్లి, గాడిపల్లిలో వ్యవసాయ బావులు, బోర్ల పరిశీలన



నక్కలపల్లి,గాడిపల్లి గ్రామాల్లో రన్‌వే భూముల్లో వ్యవసాయ బావులు, బోర్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి

ఖిలా వరంగల్ : మామునూరు ఎయిర్‌పోర్ట్ భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామని వరంగల్ ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం వరంగల్ నక్కలపల్లి , గాడిపల్లి గ్రామాల్లో తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, ఆర్‌అండ్‌బీ, హార్టికల్చర్, ఇరిగేషన్ అధికారులు, రైతులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సర్వే ద్వారా గుర్తించిన 253 ఎకరాల భూములతోపాటు వ్యవసాయ బావులు, బోర్లును పరిశీలించారు. బోర్లు, బావుల నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని అంచనా వేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్వర్వుల ప్రకారం విమానాశ్రయం రన్‌వే విస్తీర్ణం కోసం 253 ఎకరాల భూమిని సేకరించే పనిలో ఉన్నామని, సర్వే ద్వారా నక్కలపల్లి, గాడిపల్లి గ్రామాల్లో 253 ఎకరాలను గుర్తించమన్నారు. భూమి విలువతోపాటు బావులు, బోర్లు విలువను సైతం పరిహారంలో చెల్లిస్తామని తెలిపారు. ప్రతీ రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామని, త్వరలో నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల ఆర్ఐ ఆనంద్ కుమార్, సర్వేయర్ రజిత, ఇతర శాఖల సిబ్బంది, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

బాలికలే టార్గెట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

బాలికతో వ్యభిచారానికి యత్నం

- అదృశ్యం కేసుతో బయటపడిన వ్యవహారం
- నిందితులంతా పాత నేరస్తులే
- నిందితురాలే.. ఓ బాధితురాలు
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్ క్రైం: నగరంలో ఓ బాలికను అపహరించి అత్యాచారానికి పాల్పడిన అనంతరం వ్యభిచారం చేయించేందుకు యత్నిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. మంగళవారం పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీపీ సన్‌ప్రీత్‌సింగ్ వివరాలు వెల్లడించారు. ఈ కేసులో బాలికతో సహా ఓ మహిళ, నలుగురు వ్యక్తులను మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులనుంచి 1.800 కిలోల గంజాయి, కారు, రూ.75వేల నగదు, నాలుగు సెల్ ఫోన్లతోపాటు ప్రధాన నిందితురాలి ఇంటి వద్ద భారీస్థాయిలో కండోమ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.



నిందితులనుంచి స్వాధీనం చేసుకున్న కారు

నిందితులు వీరే...

హనుమకొండ జిల్లా, దామెర మండలం ల్యాదెళ్ల గ్రామానికి చెందిన ముస్కు లత, ఓ బాలిక, వరంగల్ శంభునిపేటకు చెందిన అబ్దుల్ అఫ్నాన్, షేక్‌సైలాని బాబా, మహ్మద్ అల్తాఫ్, మీర్జా ఫైజ్ బేగ్ అలియాస్ వదూద్‌లు.

అదృశ్యం కేసు నమోదుతో..

ఈ నెల 11న మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఓ బాలిక కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సదరు బాలికను ములుగు రోడ్డు వద్ద గుర్తించి సంరక్షణకు తీసుకుని విచారించారు. తనను కొంతమంది వ్యక్తులు అపహరించి, గంజాయి తాగించిన అనంతరం అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక చెప్పింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా పర్యవేక్షణలో వరంగల్ ఏసీపీ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి నిందితులను పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధాన నిందితురాలైన ముస్కు లత, ల్యాదెళ్ల గ్రామంలో వ్యభిచార వృత్తిని కొనసాగిస్తూ, తల్లిదండ్రులు మరణించిన మరో మైనర్ నిందితురాలికి తన ఇంటిలోనే ఆశ్రయం కల్పించింది. లత తన వ్యభిచార వృత్తిలో కొత్త మహిళలు, బాలికలను తీసుకురావడం ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని, దానిలో నీకు కొంత ఇస్తానని తన ఇంట్లో ఆశ్రయం కల్పించిన బాలిక(ఈమె కూడా నిందితురాలే)కు ఆశ చూపింది. ఇందుకు ఆ బాలిక సిద్ధపడి ఇన్‌స్టాగామ్ ద్వారా ఇంకో బాలికతో పరిచయం పెంచుకుంది. ఈ బాలిక స్కూల్‌కు వెళ్లే సమయంలో మైనర్ నిందితురాలు తన ప్రియుడైన అబ్దుల్ అఫ్నాన్‌తో ఆ బాలికను కలిసి బయటకు తీసుకెళ్లి మద్యం, గంజాయిని తాగడం అలవాటు చేశారు. వీరిపై ఆ బాలికకు మరింత నమ్మకం కలిగేందుకు షాపింగ్ మాల్స్‌లో కొత్త దుస్తులు ఇప్పించారు. బాధిత బాలిక వీరిని నమ్మి ఈ నెల 11న మైనర్ అయిన నిందితురాలు తన ప్రియుడుతోపాటు మరో ఇద్దరు షేక్‌సైలాని బాబా, మహ్మద్ అల్తాఫ్‌లతో కలిసి కారులో బయలుదేరి మీర్జా ఫైజ్ బేగ్ వద్ద గంజాయి కొనుగోలు చేశారు. నర్సంపేట శివారు ప్రాంతంలో నిందితుల్లో ఒకడైన షేక్‌సైలానీ బాబాకు చెందిన ఓ పురాతన ఇంటిలో బాధిత బాలికను తీసుకెళ్లి గంజాయి తాగించారు. అనంతరం షేక్ సైలానీ బాబా ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం బాలికను 'నువ్వు రేపటి నుంచి మేము చెప్పినట్లుగా వినాలి.. లేకుంటే గంజాయి తాగుతుండగా అత్యాచారం చేసి సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాం.. ఈ వీడియోను బయట పెడతాం' అని బెదిరించి ములుగు రోడ్డు వద్ద బాలికను వదిలి అక్కడినుంచి పారిపోయారు. బాలిక చెప్పిన వివరాల ప్రకారం నిందితులను పట్టుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు సీపీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు.

అధికారులకు అభినందనలు..

నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, భరోసా కేంద్రం ఇన్‌స్పెక్టర్ సువర్ణ, ఎస్సైలు శ్రీకాంత్, సురేశ్‌తోపాటు సిబ్బందిని సీపీ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించారు.

ముగిసిన 'ఎర్రగట్టు' బ్రహ్మోత్సవాలు



బారులుదీరిన భక్తులు

- నేడు హుండీ లెక్కింపు



పూజలు చేస్తున్న భక్తులు

హసన్‌పర్తి : ఎర్రగట్టు శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఐదు రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు ఎర్రగట్టు దేవాలయం నుంచి స్వామివారిని రథాలపై ప్రతిష్ఠించి భారీ ప్రదర్శన చేపట్టారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, మాజీ వైస్ ఎంపీపీ నమిండ్ల రాజేశ్వరి దంపతులు స్వామివారికి మొక్కులు సమర్పించారు. దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, ఈఓ వెంకట్రామ్, కనపర్తి రాజు, సంగాల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నేడు (బుధవారం) హుండీ లెక్కింపు చేపట్టనున్నట్లు కమిటీ చైర్మన్ తెలిపారు.

వైద్యపరికరాలు అందించడం అభినందనీయం



వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న డీఆర్ఓ విజయలక్ష్మి, ఫౌండేషన్ ప్రతినిధి సుధా జిజారియా, వైద్యాధికారులు

ఎంజీఎం : ఎంజీఎం ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అపోలో హాస్పిటల్ బిలియన్ హార్ట్స్ బీటింగ్ ఫౌండేషన్ ద్వారా సంస్థ ప్రతినిధి సుధా జిజారియా అందించిన రేడియంట్ వార్మర్స్, ఫొటోథెరపీ వైద్యపరికరాలను మంగళవారం వరంగల్ జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపోలో హాస్పిటల్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ నిధులతో ఈ వైద్య పరికరాలను అందించడం అభినందనీయమన్నారు. అనంతరం డీఆర్ఓ విజయలక్ష్మి, ఫౌండేషన్ ప్రతినిధి సుధా జిజారియాలకు ఎంజీఎం వైద్యాధికారులు మొక్క అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ అపర్ణ, ప్రొఫెసర్ అలిమేను, ఆర్ఎంఓలు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే బూత్‌లో ఉండాలి

వరంగల్: ఒకే కుటుంబానికి చెందిన వారి ఓట్లు అన్ని ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు వరంగల్ కలెక్టర్ సత్యశారదను కోరారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 7,72,824 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, ఎలక్షన్ డీటీ రంజిత్, రాజకీయ పార్టీల నాయకులు ఈవీ.శ్రీనివాసరావు, బాకం హరిశంకర్, కె.శ్యాం, ఫిరోజుల్లా, జె.అనిల్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

మార్కెట్‌లో సమస్యలు పరిష్కరించాలి

వరంగల్: ఏనుమాములలోని వ్యవసాయ మార్కెట్‌లో సమస్యలు పరిష్కరించాలని మార్కెటింగ్‌శాఖ అధికారులు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు వరంగల్ కలెక్టర్ సత్యశారదను కలిశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా రైతులకు మజ్జిగ ప్యాకెట్లు అందించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అన్నపూర్ణ క్యాంటీన్‌లో ఇప్పటివరకు అందజేస్తున్న వెయ్యి భోజనాలను రెండు వేలకు పెంచాలని చాంబర్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. సీసీ కెమెరాలు, అన్నపూర్ణ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ ఆర్‌జేడీఎం శ్రీనివాస్, డీఎంఓ సురేఖ, మార్కెట్ కార్యదర్శి జి.రెడ్డి, ఏఎస్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం చదివితేనే విజయం

- గ్రూప్–1 టాపర్ తేజస్విని రెడ్డి



మాట్లాడుతున్న గ్రూప్-1టాపర్ తేజస్విని రెడ్డి

విద్యారణ్యపురి: ప్రణాళిక ప్రకారం కష్టపడి చదివి తేనే పోటీ పరీక్షల్లో విజయం సాధ్యమని గ్రూప్ –1 టాపర్ జిన్నా తేజస్విని రెడ్డి అన్నారు. మంగళవా రం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్ కౌన్సెలింగ్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో తేజ స్వినిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సరైన ప్రణాళికతో సొంతంగా నోట్స్ రాసుకోవాలన్నారు. పోటీ పరీక్షల్లో తమకు ఏ సబ్జెక్ట్‌పై ఆసక్తి ఉందో దానిపైపట్టు సాధించేలా అందుకు సంబంధించిన పుస్తకాలు చదవవాలన్నారు. శాస్త్ర,సాంకేతిక అంశాలపై శిక్షణ నిపుణలు చల్లా నారాయణరెడ్డి, ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి. రాజారెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ కె. రజనీలత, స్టాఫ్‌సెక్రటరీ ఎం. రవికుమార్,కెరీర్ అండ్ గైడెన్స్‌సెల్ కోఆర్డినేటర్ బి.కవిత, డాక్టర్ చిన్నా మాట్లాడారు. అనంతరం తేజస్వినిరెడ్డిని ప్రిన్సి పాల్ రాజారెడ్డి ఇతర అధ్యాపకులు సన్మానించారు.

33శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి



సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మి

న్యూశాయంపేట : చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం అంబాల స్వరూప అధ్యక్షతన హనుమకొండలో జరిగిన తెలంగాణ వ్యవసాయ మహిళా కూలీల జిల్లా సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కరువైందని తెలిపారు. ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు కాకుండా బతుకు మార్చే విధానాలు తీసుకు రావాలని పేర్కొన్నారు. మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ బి.పద్మ మాట్లాడుతూ మహిళా సాధికారత పేరుతో మాటలు చెబుతున్నారు తప్ప, ఆచరణలో లేదని విమర్శించారు. మనుధర్మ శాస్త్రం అమలు చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ సదస్సులో నాయకులు బి.ప్రసాద్, జి.రాములు, వాసుదేవరెడ్డి, స్వరూప, రజిత, రమ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలో 488మంది గైర్హాజర్

విద్యారణ్యపురి : ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. హనుమకొండ జిల్లాలో మంగళవారం 55 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు జరుగగా అందులో 488 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ ఎ.గోపాల్ తెలిపారు. మొత్తంగా 18,946మంది విద్యార్థులకు గాను 18,458 మంది హాజరు కాగా 488 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు.